క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

పెదపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ హెచ్చరించారు. పెదపాడు మండలంలోని పలు చోట్ల బుధవారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

రెజ్లింగ్ పోటీల్లో శాంతిదీప్ ప్రతిభ

దెందులూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి ఆర్.శాంతిదీప్‌ను బుధవారం మేధినరావుపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించారని అన్నారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్-17 బాయ్స్ రెజ్లింగ్ ఫ్రీ స్టైల్ విభాగంలో ఆర్.శాంతిదీప్ 80 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌వీడీ రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

గణపవరం: పిప్పర శివాలయంలో బుధవారం లక్షబిల్వార్చన (లక్షపత్రి పూజ) వైభవంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ, సామాజిక సేవకుడు కొనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో శివాలయంలో కార్తీక పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. కుంకుమ పూజలు, కార్తీక దీపోత్సవం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అన్నసమారాధ కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా క్షీరాబ్ధి ద్వాదశి పూజలు

భీమడోలు: గుండుగొలనులోని దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని శ్రీవేకంటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి విశేష అలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారిని మంగళవాయిద్యాల నడుమ గ్రామపు రవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

16న గౌరీదేవి ఉత్సవం

దెందులూరు: పోతునూరులోని గౌరీదేవి ఉత్సవం ఈ నెల 16న ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. గౌరీ దేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. పోతునూరు సమీప గ్రామాల్లోని భక్తులు గౌరీ దేవి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు

ఉంగుటూరు: చేబ్రోలులో 8 చెట్లు నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. కొత్త సచివాలయ ప్రాంతంలో నారాయణపురానికి చెందిన పల్లపు ఏసురాజు ఎటువంటి అనుమతి లేకుండా గానుగ చెట్లను నరికి కలప తరలించడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

వ్యాయామ విద్యా కళాశాలలో సమస్యల తిష్ట

- ఘన చరిత్ర కలిగిన విద్యాలయం
- విద్యార్థులను వేధిస్తున్న వసతుల కొరత
- శిథిలావస్థలో భవనాలు, అధ్వానంగా అంతర్గత రహదారి



గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల


అసంపూర్తిగా హాస్టల్ భవన నిర్మాణం


శిథిలావస్థలో కిచెన్ షెడ్డు

దెందులూరు: ఏలూరు జిల్లా గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. 1967లో గోపన్నపాలెంలో ఈ కళాశాలను ఏర్పాటుచేశారు. 1977లో విద్యాదాత మూర్తిరాజు ప్రభుత్వానికి ఈ కళాశాలను స్వాధీనం చేశారు. ఈ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ డిప్లొమో (యూజీడీ), బ్యాచలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (డీపీఈడీ) కోర్సులు ఉన్నాయి. కళాశాల ప్రారంభం నుంచి అధ్యాపకుల కొరతతో విద్యార్థులు సతమతమవుతూనే ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 8 మంది అధ్యాపకులు ఉండాలి. ప్రిన్సిపల్, ఇద్దరు అధ్యాపకులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.కోటి నిధుల మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కళాశాలకు వచ్చి అక్కడి ఇబ్బందులను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ వ్యాయామ కళాశాల ప్రాధాన్యతను తెలియజేసి సుమారు కోటి రూపాయల నిధులను నాడు- నేడు, మన బడి పథకంలో నిధులు కేటాయించారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.99,96,890 నిధులు 2022లో మంజూరు చేసింది. వాటిని మూడు విడతలుగా నగదు రూపంలో రూ.36 లక్షలు, రూ.35 లక్షలు సామగ్రి రూపంలో విడుదల అందజేశారు. ఆ నిధులతో హాస్టల్ భవన నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వం మారిన తరువాత కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు విడుదల చేయకపోవడంతో హాస్టల్ నిర్మాణం నిలిచిపోయింది. ప్రస్తుతం శిథిలావస్థలోఉన్న భవనంలో విద్యార్థినులు తలదాచుకుంటున్నారు. ఈ భవనం పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 5 బాత్‌రూమ్‌లు, 5 టాయిలెట్లకు నీటి సరఫరా కూడా లేకపోవడంతో విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భోజనం చేసే కిచెన్ షెడ్డు సైతం శిథిలావస్థకు చేరడంతో శిక్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండోర్ స్టేడియం, అంతర్గత రోడ్డు ఏర్పాటుచేయాలని అధ్యాపకులు కోరుతున్నారు. కళాశాలకు, వైద్యశాల పక్క భాగంలో ప్రహరీ గతేడాది తొలగించడంతో ఆ ప్రాంతం రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. కొందరు ప్రాంగణంలో పశువులను మేపుతున్నారు. కళాశాల సిబ్బంది అడుగుతుంటే వారిపై ఎదురుతిరుగుతూ దౌర్జన్యం చేస్తున్నారు. ఇదంతా బాలికలు ఉండే భవనం వద్ద జరుగుతున్న తంతు. ఇటీవల ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెళ్లి హాస్టల్, కిచెన్, ప్రహరీ, బాత్‌రూమ్‌లు సమస్యలను పరిశీలించారు. తాత్కాలికంగా తనవంతు కొంత మేర సమస్యలు పరిష్కరిస్తానని, మిగిలిన వాటిపై రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని కలెక్టర్ వెట్రి సెల్వి ప్రిన్సిపల్, విద్యార్థులకు హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నాం. త్వరలోనే అధ్యాపకుల సమస్య తీరనుంది. రూ.99 లక్షల్లో మిగిలిన 30శాతం నిధులు మంజూరైతే ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో ఏకైక వ్యాయామ కళాశాలగా కీర్తిప్రతిష్టలు ఉన్నప్పటికీ నిధులు, సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– డాక్టర్ ఎస్.నత్తానియేలు, కళాశాల ప్రిన్సిపల్

నేటి నుంచి గ్రంథాలయ ఉత్సవాలు ప్రారంభం


గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: దెందులూరు, పోతునూరు గ్రంథాలయాల్లో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని గ్రంథాలయాధికారులు ఝాన్సీ, రాంబాబు తెలిపారు. బుధవారం పోతునూరు గ్రంథాలయంలో స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం వలి, ఉపాధ్యాయులు కృష్ణలత, సుభాషిని, నాయుడు, గ్రంథాలయ అధికారి రాంబాబు, గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

నేటి నుంచి శాఖ వారోత్సవాలు

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతాయని గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరరావు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న డాక్టర్ అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి, 17న గ్రంథాలయాలపై అవగాహన, 18న వ్యాసరచన, 19న ఇందిరాగాంధీ జయంతి, 20న ముగింపు బహుమతి ప్రధానోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

గ్రంథాలయాలే ముద్దు.. సెల్‌ఫోన్లు వద్దు

భీమడోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం భీమడోలు శాఖా గ్రంథాలయం విద్యార్థులు, అభివృద్ధి కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 14వ తేదీ గురువారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారు.గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పాల్గొన్నారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో వారోత్సవాల కరపత్రాలను హెచ్ఎం పాశం పాండురంగారావు ఆవిష్కరించారు.

జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు రంగం సిద్ధం

- మూడు జిల్లాల నుంచి వెయ్యి మంది క్రీడాకారుల రాక
- నేటి నుంచి క్రీడాపోటీలు


వివిధ ప్రాంతాల నుంచి పోలసానిపల్లి కళాశాలకు చేరుకుంటున్న క్రీడాకారులు

భీమడోలు: ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు పోలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల వేదిక కానుంది. ఆటలు, స్పోర్ట్స్ పోటీలను పగడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఒకే చోట పోటీలు జరుగుతుండడంతో వారిలో నూతనోత్సాహంతో ఒడుకుంది. జోనల్‌లోని మూడు ఉమ్మడి జిల్లాల్లోని క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈనెల 14వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ పోటీలను ప్రారంభించనున్నారు. పోలసానిపల్లి బాలికల గురుకుల కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 29 కళాశాలలకు చెందిన 1,050 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారు. వారితో పాటు 60 మంది పీడీలు, పీఈటీలు, వారికి సహాయకులుగా ఒకొక్క పాఠశాలకు నాలుగు చొప్పున 120 మందిని నియమించారు. కరోనా విపత్కర పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులందరినీ ఒకే చోట ఉంచి పోటీలు నిర్వహించడం మంచిది కాదని అప్పటి ఆరోగ్య, వైద్య నిపుణులు సూచించిన నేపథ్యంలో కొన్నేళ్లుగా ఈ తరహా పోటీలను నిర్వహించలేదు. పోలసానిపల్లి గురుకుల కళాశాలలో నిర్వహించే పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారిణిలు పాల్గొననున్నందున ఉన్నతాధికారుల సూచనల మేరకు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పాఠశాల ఆట స్థలాన్ని చదును చేసి క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు


వెల్లమెల్లిలో డ్రైడే ఫ్రైడేపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ఉంగుటూరు: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని, దోమ కాటుతో ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తున్నాయని తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న వెల్లమెల్లిలో నిర్వహిస్తున్న వ్యాధుల నివారణ, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి ఫ్రై డే, డ్రై డే పాటించాలని సూచించారు. ప్రజలకు పరిసర పరిశుభ్రతపై అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణ, శారద ఎం.ఎల్.హెచ్.పి. సంధ్య అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ, లక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్య

దెందులూరు: బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగిఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు అధికారి కే.విజయలక్ష్మి అన్నారు. బుధవారం దెందులూరు మండలం కొవ్వలిలోని అంగన్‌వాడీ కేంద్రం- 158లో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కోఆర్డినేటర్ నిర్మల, సెక్టర్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతోపాటుగా గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం పూర్తి భోజనం అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నెరవేరుస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ నాగవేణి, కిషోర్ బాలికలు, బాలింతలు, గర్భిణులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాల రికవరీ

పెదవేగి : చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చినట్టు పెదవేగి ఎస్సై కె రామకృష్ణ అన్నారు. బుధవారం ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి మండలం రామశింగవరం గ్రామానికి చెందిన నల్లగోపు అంబిక ఇంటిలో జూన్ 8వ తేదీ రాత్రి సమయంలో తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న బంగారం వెండి వస్తువులను అపహరించిన విజయవాడకు చెందిన కుంభ గోపికృష్ణ, భట్టిపల్లి సూర్యప్రకాష్ అలియాస్ సూర్య, నాగవరప్పాడుకు చెందిన వేముల అజయ్ బాబును నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ కె వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పెదవేగి ఎస్సై కె రామకృష్ణ అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు పావు తక్కువ ఐదు కాసుల బంగారు వస్తువులను, 134 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసి స్వాధీనపర్చుకొని ముగ్గురునీ అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం


రాచూరులో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తపన ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మారుతీరాణి అన్నారు. ఉంగుటూరు మండలం రాచూరిలో బుధవారం తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మాలతీ రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరిని అభినందించారు. రాచూరులో మూడు నెలపాటు నిర్వహించే కుట్టు శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రాచూరు సర్పంచ్ దారపురెడ్డి సీత, బీజేపీ నాయకులు నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

భీమడోలు: క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఖాయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల కెరియర్ గైడెన్స్ కమిటీ చైర్‌పర్సన్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమం మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తొమ్మిదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, డిక్షనరీలు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, హెచ్ఎం బి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకోసం ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ

భీమడోలు: భీమడోలు గ్రామ పంచాయతీ పరిధిలో 2019 నుంచి 2024 వరకు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఇద్దరు వ్యక్తులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశాల మేరకు నూజివీడు డీఎల్‌పీవో ఎంఎస్‌పీ సుందరిని విచారణాధికారిగా నియమించారు.ఈ నేపథ్యంలో భీమడోలు పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆమె విచారణ చేసారు. ఈవోఆర్‌డీ ఏ.సుందరి, పంచాయతీ కార్యదర్శి కేఎల్‌వీ తనూజల నుంచి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు జక్కుల ముసలయ్య, గోగులమూడి రవికుమార్ హాజరై లిఖిత పూర్వక స్టేట్‌మెంట్లను అందించారు. పంచాయతీ కార్యాలయంలోని ఐదేళ్ల కాలంలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి అప్‌డేట్ చేసుకుని సంసిద్ధంగా ఉండాలని డీఎల్‌పీవో సంబంధిత మండల, పంచాయతీ అధికారులను ఆదేశించారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద బుధవారం ఉదయం భీమడోలు వైపు వెళుతున్న వ్యాన్ టైరుకు పంక్చరై నిలిచిపోయింది. వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీ కొట్టిందని దెందులూరు ఎస్సై ఆర్. శివాజీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో కృష్ణాజిల్లాకి చెందిన మల్లపల్లి గ్రామస్తుడు డ్రైవర్ మందాడ రామాంజనేయులుకు రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్స్‌లో ఏలూరు వైద్యశాలకు తీసుకువెళ్లారు. వైద్యులు సూచన మేరకు ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చర్చిలోకి దూసుకువెళ్లిన లారీ

ఉంగుటూరు: నారాయణపురంలో ఆర్‌అండ్‌బీ రాష్ట్ర రహదారిని ఆనుకుని మలుపులో ఉన్న చర్చిలోకి బుధవారం లారీ దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బుధవారం విజయవాడ నుంచి నారాయణపురం వస్తున్న లారీ వంతెన డౌనులోని కో ఆపరేటివ్ బ్యాంకు సమీపంలో మలుపు వద్ద ఉన్న చర్చిలోకి దూసుకు వెళ్లింది. ఎస్సై మామిడాల సూర్యభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ సమావేశం

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయడానికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి శిక్షణ సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల సమైక్య అధ్యక్షులు తరగతులకు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు


పెసర మినుము విత్తనాలు అందిస్తున్న అధికారులు

పెదపాడు: ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా తెలిపారు. పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరక్టరు బి.నెహ్రూ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లుకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చునని తెలిపారు. సత్యవోలు గ్రామంలో పాడి రైతుకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఎన్ఎఫ్ఎస్ఎం పథకంలో భాగంగా మినుము విత్తనాలు రైతులకు అందించినట్టు చెప్పారు. రబీ పంట బీమా చెల్లించాలన్నారు. ఏడీ ఫిషరీస్ బి.రాజ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

ఉంగుటూరు: సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను విడుదల చేశామని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు తెలిపారు. 7 సాగునీటి సంఘాల్లో 15,153 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. 8 మైనర్ ఇరిగేషన్ చెరువులకు 1,147 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన వివరించారు. బాదంపూడి నీటి సంఘంలో 2,750 మంది ఓటర్లు (రైతులు) ఉన్నారని, రాచూరు సాగునీటి సంఘంలో 1,291 మంది, ఉంగుటూరులో 1,475 మంది, చేబ్రోలులో 2,350 మంది, కైకరంలో 1,649 మంది, బొమ్మిడిలో 3,206 మంది, దొంతవరం సాగునీటి సంఘంలో 2,432 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దారు తెలిపారు. మైనర్ ఇరిగేషన్ చెరువులైన నల్లమాడు పెద్ద చెరువు పరిధిలో 242 మంది, నాచుగుంట పట్టెమ్మచెరువు పరిధిలో 144 మంది, వెల్లమిల్లి వీరభద్రుని చెరువు పరిధిలో 171 మంది, గోపీనాథపట్నం పెద్ద చెరువు పరిధిలో 183 మంది, ఎ.గోకవరం పెద్ద చెరువు పరిధిలో 167 మంది, కైకరం కొత్త ట్యాంకు పరిధిలో 89 మంది, కొడుకుల గుంట పరిధిలో 85మంది, నందిభవాని చెరువు పరిధిలో 66మంది రైతులు ఉన్నారని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీల వద్ద జాబితాలు ప్రదర్శనకు ఉంచామని తెలిపారు.